గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 35.5°C | కనిష్టం : 21.5°C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.31 గం..
సహర్ : శనివారం ఉ : 5.02 గం..



రిజిస్ట్రేషన్ శాఖలో.. అక్రమాల పర్వం!

- నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో డాక్యుమెంట్ రైటర్లదే హవా
- ఫీజు టూ ఫీజు పేరిట వసూళ్లు
- స్లాట్ లేకుండానే వ్యవహారం నడిపిస్తున్నవైనం
- మధ్యవర్తులతో దందా నడిపిస్తున్న కొందరు అధికారులు

రాంనగర్, మార్చి 14: ఉమ్మడి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో అక్రమాల పర్వం కొనసాగుతోందని, భూములు, ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన ప్రక్రియలో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్తుల రేట్ల ఆధారంగా వసూళ్ల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయాల్లో పని జరగాలంటే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని, నేరుగా వెళితే పనులు జరుగవని ప్రజలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని మరీ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

డాక్యుమెంట్ రైటర్స్ హవా

ఉమ్మడి జిల్లాలో హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు మరో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతీ కార్యాలయ పరిధిలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్స్ ఉంటారు. ప్రతీ కార్యాలయంలో ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్స్ ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. కొందరు డాక్యుమెంట్ రైటర్లు అధికారులకు సన్నిహితంగా ఉంటూ క్రయవిక్రయాల్లో కీలకపాత్ర పోషించి పెద్దఎత్తున కూడబెట్టుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల్లో 2వేల మందికిపైగా డాక్యుమెంట్ రైటర్స్ ఉండగా, హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 250మందికి పైగా ఉంటారు. కొందరు రైటర్స్ ఆస్తుల విలువ ప్రకారం క్రయవిక్రయదారులతో బేరసారాలు నడిపి అధికారులతో పని కానిచ్చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో ఫీజు టూ ఫీజు పేరిట వసూళ్లు చేస్తుంటారని, అధికారులు తమవద్దకు వచ్చిన ప్రతీ డాక్యుమెంట్‌ను పరిశీలించి అది ఏ రైటర్ నుంచి వచ్చిందో నోట్ చేసుకుని సాయంత్రం వసూళ్లు చేస్తారని సమాచారం. వారు ప్రత్యేకంగా నియమించుకున్న ప్రైవేటు వ్యక్తి సాయంత్రం డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లి ఆయన పరిధిలో చేసిన డాక్యుమెంట్ల సంఖ్య ఆధారంగా వసూలు చేస్తాడని తెలిసింది. ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల చొప్పున, ఏదైనా సమస్య ఉంటే అదనంగా తీసుకుంటారన్నది బహిరంగ సత్యమేన్న అభిప్రాయాలున్నాయి. ఇక నగరం పరిధిలోని కార్యాలయాల్లో అయితే ఈ వసూళ్లు లక్షల్లో ఉంటాయనే ప్రచారం ఉంది. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లయితే అత్యాశతో అధికారులను ప్రలోభాలకు గురిచేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి పట్టుబడిన సంఘటనలున్నాయి. వరంగల్‌లోని ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక డాక్యుమెంట్ రైటర్ సంబంధిత కార్యాలయ అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి బలైన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో అధికారులు సస్పెండ్ కాగా, సదరు డాక్యుమెంట్ రైటర్ జైలుకు వెళ్లారు. కొద్ది నెలల కిందట జరిగిన ఈ సంఘటన ఆ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఇదిలాఉంటే కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు విచ్చలవిడిగా సంపాదించి ప్రజాప్రతినిధులకు సన్నిహితంగా ఉంటూ అధికారులపై పెత్తనం చేసే స్థాయికి చేరుకున్నారంటే వారి హవా ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్లాట్ లేకుండానే రిజిస్ట్రేషన్..

వాస్తవానికి స్లాట్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన పెట్టింది ప్రభుత్వం. క్రయవిక్రయదారులు ముందస్తుగా స్లాట్‌బుక్ చేసుకుంటే తేదీ, సమయం వస్తుంది. దీని ఆధారంగా క్రయవిక్రయదారులు కార్యాలయం చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. కానీ కార్యాలయాల్లో దీనికి భిన్నంగా జరుగుతోంది. ప్రతీ సబ్ రిజిస్ట్రార్ రోజుకు 36స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఇంతకు మించి స్లాట్ బుకింగ్ ఉండదు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండటంతో ఒక్కొక్కరికి 36 చొప్పున ఇద్దరికి 72రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంటుంది. మిగతా 12 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కేవలం 36స్లాట్స్‌కు అవకాశం ఉంటుంది. నగర పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిబంధనల మేరకు 36 స్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్లు సైతం చేస్తుంటారు. ఇదంతా మధ్యవర్తుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న విమర్శలున్నాయి. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా వచ్చే క్రయవిక్రయదారుల వద్ద ఇష్టం వచ్చినంత వసూలు చేసి తతంగం పూర్తి చేస్తారనే ఆరోపణలున్నాయి. నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్లు చేసే సబ్ రిజిస్ట్రార్లు కూడా ఆదాయం వస్తుండటంతో కార్యాలయ సమయం పూర్తయినా లెక్కచేయకుండా రిజిస్ట్రేషన్లు చేస్తారని తెలిసింది. స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల కంటే నాన్‌స్లాట్ రిజిస్ట్రేషన్ల ద్వారానే పెద్ద ఎత్తున ముడుపులు అందుతాయనే ప్రచారం ఉంది.

దృష్టి సారించని శాఖ ఉన్నతాధికారులు

ప్రతీ కార్యాలయంలో దందాలు కొనసాగుతుంటాయనే సమాచారం ఉన్నా రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉన్నతాధికారులు అంతగా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. మీడియాలో వార్తలు వచ్చినప్పుడు నామమాత్రపు తనిఖీలు చేసే అధికారులు మిగతా రోజుల్లో కార్యాలయాలవైపు కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. కొన్ని సందర్భాల్లో అవకతవకలకు పాల్పడే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు పెండింగ్ విచారణ పేరుతో కోరుకున్న స్థానాల్లో పునర్నియామకం చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలో ఆరోపణలతో వేటు పడిన కొందరు ఉద్యోగులు పెండింగ్ విచారణ పేరిట ఆదాయం ఉండే స్థానాల్లో పోస్టింగ్ తీసుకుని కొనసాగుతుండటం గమనార్హం.

'టీజీ'లోనే తెలంగాణ ఆత్మగౌరవం

- ఉద్యమ సమయంలో వాహనాలన్నీ టీజీగా మార్చుకున్నాం..
- నేటినుంచి కొత్త వాహనాలకు 'టీజీ' సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14: టీజీ అనే పదంలో తెలంగాణ ఆత్మగౌరవం ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో వాహనాలన్నీ ఏపీ అని ఉంటే టీజీగా మార్చుకున్నామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జూన్ 2న గెజిట్ కూడా టీజీ అనే ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఏ ఉద్దేశంతోనో కేంద్ర ప్రభుత్వానికి నివేదించి టీఎస్‌గా మార్చిందన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేబినెట్, శాసనసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందించామని, దానికి అనుగుణంగానే తెలంగాణ రాజపత్రంలో టీఎస్ స్థానంలో టీజీగా మారుస్తూ గురువారం ప్రకటించిందన్నారు. ఇది పార్టీ పరంగానో, వ్యక్తిగతంగానో తీసుకున్న నిర్ణయం కాదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తీసుకున్న నిర్ణయమన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అణచివేసిందని మంత్రి పొన్నం పేర్కొన్నారు. టీఎస్ అయితేంది?.. అని విమర్శిస్తున్నారు కానీ.. ఆనాడు ఎందుకు మార్చాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. గెజిట్ వచ్చిన తర్వాత టీఎస్‌గా ఎందుకు మార్చారో చెప్పాలన్నారు. టీజీ పేరున 0001 నుంచి నెంబర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. గతంలో టీఎస్‌తో రిజిస్ట్రేషన్ అయిన వాహనాల నెంబర్లు అలాగే ఉంటాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు, తెలంగాణ గీతం విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

రవాణా వ్యవస్థను పకడ్బందీ చేస్తాం..

ఇటీవల జరుగుతున్న వీఐపీ వాహనాల ప్రమాదాల నేపథ్యంలో ప్రతీ వీఐపీ, హెవీ వెహికల్ డ్రైవర్లకు ఫిట్‌నెస్ టెస్టులు చేయిస్తామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. విదేశాల్లో మాదిరిగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో మార్పులు, చేర్పులు చేసి రవాణా వ్యవస్థను పకడ్బందీ చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్‌రెడ్డి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



విద్యార్థులతో హనుమకొండ బస్టాండ్

కరీమాబాద్, మార్చి 14: ఇంటర్ సెంకడియర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు గురువారం జరిగిన పరీక్షకు జిల్లాలో 93.5శాతం, హనుమకొండ జిల్లాలో 97.4శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్‌లో 5,948 మంది విద్యార్థులకు 5,948 మంది హాజరుకాగా, హనుమకొండలో 17,950 మంది విద్యా ర్థులకు గాను 17,489 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు ఇంటిముఖం పట్టారు. దీంతో హాస్టళ్లు సగం ఖాళీ అయ్యాయి. తల్లిదండ్రులు వారి పిల్లలను, వారి సామగ్రితో ఇంటికి తీసుకెళ్లారు. పరీక్షలు ముగియ డంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి రెండు జిల్లాల డీఐఈవోలు మాధవరావు, గోపాల్ ధన్యవాదాలు తెలిపారు.

నేటినుంచి ఒక్కపూట బడులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి14: నేటి నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు ఒంటి పూట బడులను నిర్వహించాలని ఇప్పటికే విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయి. ప్రతీ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన తరువాతనే విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. ఒంటి పూట బడులు ఈ విద్యాసంవత్సరం ఆఖరి దినమైన ఏప్రిల్ 23వరకు కొనసాగుతాయి. పదోతరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. పదవ తర గతి ప్రత్యేక తరగతి యథావిధిగా కొనసాగుతాయి.



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన స్వాతి లక్రా

విధి నిర్వహణే పరమావధి కావాలి

టీఎస్ఎస్‌పీ రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

సంగెం, మార్చి 14 : విధి నిర్వహణే పోలీసులకు పరమావధి కావాలని టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా చెప్పారు. మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో గురువారం నూతనంగా నిర్మించనున్న పోలీసు భవనాలకు ఆమె శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ నిత్యం విధులు నిర్వహించే పోలీసు కుటుంబాలకు, అధికారులకు రాష్ట్ర పోలీసు శాఖ కొత్త భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ఫోర్త్ బెటాలియన్‌లో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 19 భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రమేష్, టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ డీఐజీ ఎంఎస్ సిద్దికి, ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాసరావు, వీరన్న, ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, దయాశీల పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తా..

- బల్దియా నూతన కమిషనర్ అశ్విని తానాజీ వాకడె
- అదనపు కమిషనర్ రషీద్ నుంచి బాధ్యతలు స్వీకరణ



మేయర్ గుండు సుధారాణికి పూల మొక్క అందిస్తున్న నూతన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 14: వరంగల్ నగరాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తి సహకారం అందిస్తానని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ అశ్విని తానాజీ వాకడె స్పష్టం చేశారు. గురువారం వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా ప్రధాన కార్యాలయంలో బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రిజ్వాన్ బాషా నెల కిందట జనగామ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి ప్రావీణ్య నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా అశ్విని తానాజీ వాకడెను రాష్ట్ర ప్రభుత్వం గురువారం వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మహారాష్ట్ర రాష్ట్రం షోలాపూర్‌కు చెందిన అశ్విని తానాజీ వాకడె 2019లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 2020లో శిక్షణ పూర్తి చేసి తెలంగాణ కేడర్‌కు ఎంపికయ్యారు. ఇంతకు ముందు వరంగల్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా అశ్విని పనిచేశారు. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత అశ్విని తానాజీ వాకడె మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి గ్రేటర్ సిబ్బంది సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తామన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

కాగా, కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని తానాజీ వాకడె మేయర్ గుండు సుధారాణిని కలిసి పూల మొక్కను అందించారు. మేయర్ చాంబర్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఇద్దరు కలిసి నగరాభివృద్ధిపై కాసేపు మాట్లాడుకున్నారు. వరంగల్ ప్రజలకు మెరుగైన సేవలందించాలని కమిషనర్‌కు సుధారాణి సూచించారు.

ఏనుమాములకు పోటెత్తిన మిర్చి



మిర్చి బస్తాలతో నిండిపోయిన మార్కెట్ యార్డులు

- మార్కెట్‌కు సుమారు 70వేల బస్తాల రాక
- డిమాండ్ లేక తగ్గిన మిర్చి ధరలు
- కోల్డ్‌స్టోరేజీలకు తరలించిన కొందరు రైతులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 14: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం ఎర్రబంగారం (మిర్చి) పోటెత్తింది. సుమారు 70వేల మిర్చి బస్తాలు అమ్మకానికి రావడంతో యార్డులన్నీ నిండిపోయాయి. ఈ సీజన్‌లో ఇంత పెద్దమొత్తంలో పంట మార్కెట్‌కు రావడంఇదే మొదటిసారని అధికారులు చెబుతుండగా.. మార్కెట్ రెండోగేటు నుంచి పల్లి, అపరాలు, మిర్చి యారులతో పాటు మార్కెట్ కార్యాలయ పరిసరాలన్నీ మిర్చి బస్తాలతో నిండిపోయాయి. అయితే రెండేళ్ల క్రితం మిర్చి ధరలు ఆకాశాన్ని అంటడంతో ఈసారి కూడా అదే రీతిలో రేటుపలుకుతుందని భావించిన రైతులు మిర్చిని విస్తారంగా సాగుచేశారు. కానీ ఈసారి దిగుబడి ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో పంటకు అంతగా డిమాండ్ లేకపోవడంతోధరలు భారీగా పతనమవుతున్నాయి. మిర్చి ధరలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయన్న వార్తలతో రైతులు తమ దగ్గర ఉన్న మిర్చిని వెంటనే అమ్ముకునేందుకు ఉరుకులుపరుగులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా అత్యవసరం ఉన్న రైతులు వచ్చిన రేటుకు అమ్ముకుంటుంటే .. కొందరు రైతులు మాత్రం భవిష్యత్‌లో ధర వస్తుందన్న ఆశతో పంటను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. గురువారం ఏనుమాముల మార్కెట్లో సింగిల్ పట్టి రకం మిర్చి క్వింటాకు రూ.44వేలు, దేశీరకం రూ.36వేలు, తేజా రకం రూ.20,100, యూఎస్341 రకం రూ.17వేలు, వండర్‌హాట్ రూ.18వేలు, తాలు రూ.8500 పలికింది. ఈ ధరన్నీ నాణ్యంగా ఉన్న పంటకు మాత్రమే దక్కగా.. నాణ్యతలేని పంట క్వింటాకు రూ.10వేల నుంచి రూ.15వేల మధ్యలోనే అమ్ముడైంది. రెండేళ్ల క్రితం ఇదే సింగిల్ పట్టి, దేశీ రకాలకు క్వింటాకు రూ.90వేలకు పైగా పలికాయి. కానీ ఈసారి ధరలు భారీగా పతనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఇదే అదనుగా కొందరి చేతివాటం

మార్కెట్‌కు మిర్చి బస్తాలు భారీ సంఖ్యలో రావడంతో అధికారులు, సెక్యూరిటీ వాళ్ల వాళ్ల పనిలో వాల్లుంటే కొందరు కూలీల పేరుతో దోపిడీకి తెరతీసారు. రైతుల బస్తాలలో నుంచి అందినకాడికి చేతులతో తీసుకునిపోయి ఆ పంటను అమ్ముకుని వారు సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరమో ముసీం, దానం అంటూ రైతుల వద్ద బలవంతంగా మిర్చిని వసూలు చేశారు. ఇలాంటివి జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి:



ఐలయ్య, రైతు భూపాలపల్లి

దేశీ మిర్చిని అమ్ముకునేందుకు వచ్చిన. క్వింటా రూ.36వేలు అంటున్నరు. ఆ రేటుకు కూడా కొనేవారు రాలేదు. ఒకవేళ వర్షం వస్తే మా పని గోవిందా.. బస్తాలు బయటే ఉన్నాయి. కొనుగోలు దారుల కోసం ఉదయం నుంచి ఎదురు చూస్తున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. మార్కెట్లో పలికే ధరలు గిట్టుబాటు కావడంలేదు. సాగు ఖర్చులు పెరిగి మార్కెట్లో ధరలు తగ్గడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

పత్తి ధర గురువారం స్వల్పంగా పెరిగింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కొద్ది రోజులుగా రోజుకు రూ.పది, రూ.20మాత్రమే పెరుగుతూ వచ్చిన ధర క్వింటాకు గురువారానికి రూ.7,370కి చేరింది. మార్కెట్‌కు సుమారు 800పత్తి బస్తాలు అమ్మకానికి రాగా.. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.7,020 కన్నా అధికంగా రూ.350 ఎక్కువ పలికింది. కానీ ఇప్పటికే దాదాపు 85శాతం పత్తిని అమ్ముకున్నామని, ఇప్పుడు ధర పెరిగితే తమకేం లాభమని రైతులు వాపోతున్నారు.

ఇక గురువారం మిర్చి పెద్ద ఎత్తున రావడంతో అధికారులు మిర్చి కొనుగోళ్లలో ఉండగా.. పత్తి యార్డులో కొందరు దడువాయి లేకుండానే వ్యాపారులు కాంటాలు పెట్టుకుని వెళ్లిపోయారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

కేయూ క్యాంపస్, మార్చి 14: జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన, అభివృద్ధి సంస్థల నేతృత్వంలో రెండు నెలల పాటు 100 మంది నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇచ్చేందుకుగాను ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కె.జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బీఎడ్, డైట్, టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు http://tsstudycircle.-co.in/ వెబ్‌సైట్‌లో మార్చి 24 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బీసీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో రెండు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీపీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-29303130 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కాజీపేట, మార్చి 14: తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ కాజీపేట మండల నూతన కమిటీ గురువారం ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలుగా కె.రమాదేవి, కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా పి.శారద, ఉపాధ్యక్షురాలుగా ఎం. అరుణ, టి.శ్రీదేవి, సహాయ కార్యదర్శిగా డి.లలిత ఎన్నికయ్యారు. అంతకు ముందు సో మిడి సెక్టార్ లీడర్లుగా ఎం.కవిత, డి.బాలశ్రీ, పి.రఘుకుమారి, మడికొండ సెక్టార్‌కు పి.వెంకటలక్ష్మి, పి.శారద, కె.రాజ్యలక్ష్మి, దర్గా సెక్టార్‌కు టి.జ్ఞానసుందరి, ఎం. అరుణ, కె.రజనీలను ఎన్నుకున్నారు.

16న నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

వరంగల్ క్రైం, మార్చి 14: వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయంబ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాలో 3వేలకు పైగా ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపడతాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత.. కనీసం 10వతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువత ముందస్తుగా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.

బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్‌ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్‌ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్టు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్టు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్‌ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరపు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్ రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్‌ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్‌ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్‌ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్‌ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్‌ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



భద్రకాళి అమ్మవారి సన్నిధిలో కడియం కావ్య పూజలు

వరంగల్ కల్చరల్, మార్చి 14: వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో ముందుగా గురువారం శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలవాలని ముందస్తుగా భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ మేరకు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కావ్య వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కావ్యను ఆశీర్వదిస్తున్న అర్చకులు భద్రకాళి శేషు

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

మట్టెవాడ, మార్చి 14: రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గ సీట్లు మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు కేదాసి మోహన్ అన్నారు. గురువారం పోచమ్మ మైదాన్ ఓ ప్రైవేటు హోటల్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. మోహన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అహంకారంతో మాదిగలను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేసే విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా కలిగిన మాదిగలను అణచివేసే ధోరణి మార్చుకోవాలన్నారు. వరంగల్ ఎంపీ టికెట్ మాదిగలకే కేటాయించాలని, లేదంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మెట్టుపల్లి కొమురయ్య, పొట్ల రమేష్, వక్కుల కుమార్, సుదర్శన్, అంజనేయులు, ప్రసాద్, ఆనందం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టీఎన్‌జీవో డైరీ అందజేత



కలెక్టర్ ప్రావీణ్యకు డైరీ అందజేస్తున్న టీఎన్‌జీవో నేతలు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 14: ఉద్యోగులకు ఉపయోగపడే జీవోలు, నియమ నిబంధనలు, సర్వీస్ రూల్స్ ఒకేచోట పొందుపర్చి డైరీ రూపొందించడం అభినందనీయమని కలెక్టర్ పి.ప్రావీణ్య కొనియాడారు. టీఎన్‌జీవో యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీని కలెక్టర్‌కు గురువారం టీఎన్‌జీవో నేతలు అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ మాట్లాడుతూ ఉద్యోగులకు కలెక్టర్ అన్ని విధాల సహాయ సహకారాల అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గాజె వేణుగోపాల్, హేమ నాయక్, పాలకుర్తి సదానందం, గద్దల రాజు, దుర్గారావు, రాజేష్, సునీత నాయక్, నూతన్, సందీప్, శ్వేత, గణేష్, వెలిశాల రాజు, మధుచంద్ర, శ్రీనివాస్, సుదర్శన్, ప్రశాంత్, నిరంజన్‌రెడ్డి, చందు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

తమ్మెరభవన్‌లో కారల్‌మార్క్స్ వర్ధంతి

ఖిలావరంగల్, మార్చి 14: ప్రపంచ కార్మికులను ఏం చేసిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో కారల్‌మార్క్స్ 141వ వర్ధంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ మార్క్స్ ఆలోచనలు కార్మికుల అభివృద్ధికి దోహదపడటమే కాక, ప్రపంచవ్యాప్తంగా కార్మిక విప్లవాలకు నాంది పలికాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషుమియా, నాయకులు సంగి ఏలేందర్, శరత్, సుదీర్ పాల్గొన్నారు.

నత్తనడకన షాదీఖానా పనులు

• రూ.4కోట్లతో శంకుస్థాపన • మూడేళ్లయినా పూర్తవని నిర్మాణం • అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



వరంగల్ ఎల్‌బీనగర్‌లో నిర్మాణదశలోనే ఉన్న ఉర్దూ భవన్ షాదీఖానా

పోచమ్మమైదాన్, మార్చి 14: నగరంలో మైనారిటీ సంక్షేమం కోసం తలపెట్టిన ఉర్దూ భవన్ షాదీఖానా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు లేకపోవడంతో పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో 2021 ఏప్రిల్‌లో అప్పటి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరై షాదీఖానా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో మైనారిటీలతోపాటు అన్ని వర్గాల సౌకర్యార్థం ఆధునిక హంగులతో షాదీఖానా నిర్మాణం తలపెట్టారు. సకల వసతులతో ప్రణాళిక సిద్ధం చేసి జీ ప్లస్ టూగా నిర్మాణ పనుల కోసం గత ప్రభుత్వంలో నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసింది. మూడేళ్లయినా పనులు ఇప్పటి వరకు నిర్మాణ దశలోనే ఉండడంతో స్థానికులు మండిపడుతున్నారు.

● ఎక్కడిపనులు అక్కడే..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన ఉర్దూ భవన్ షాదీఖానా పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక చొరవతో షాదీఖానా సాధించానని చెబుతూ, ఎన్నికలలో ప్రచార అస్త్రంగా వాడుకున్నారు. కానీ, మూడేళ్లలో మొదటి అంతస్తు కూడా పూర్తి కాకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కాంట్రాక్టరు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో నత్తనడకగా పనులు కొనసాగుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● నిరుపేదల ఎదురుచూపు..

నియోజకవర్గంలోని మైనారిటీలు అధిక శాతం నిరుపేదలే. శంభునిపేట, ఉర్సు, ఎల్‌బీనగర్, దేశాయిపేట, లేబర్‌కాలనీ, పోచమ్మమైదాన్ తదితర ప్రాంతాలలో ఉన్న నిరుపేదల కుటుంబాలలో వివాహాది శుభకార్యానికి ఫంక్షన్ హాల్స్ కోసం వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. ఈ క్రమంలో షాదీఖానా నిర్మాణం పూర్తైతే మైనార్టీలకే కాకుండా అన్ని వర్గాల పేదలు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీంతో భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని పేదలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గెలిచి, మంత్రిగా ఉన్న కొండా సురేఖ చొరవ తీసుకుని పనుల్ని త్వరిత గతిన పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని వేడుకుంటున్నారు.

బోధనా సిబ్బంది కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీమాబాద్, మార్చి 14: మహాత్మజ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల (బాలుర) కళాశాల కరుణాపురంలో ఈఏపీ సెట్, నీట్ షార్ట్ టర్మ్ కోచింగ్ నిమిత్తం మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన, అనుభవం కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 18 వరకు కరుణాపురంలోని ఎంజేపీ బాలుర కళాశాలలో తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయ కర్త వై.మనోహర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 88014 18368 ఫోన్ నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

కోళ్ల పెంపకంతో ఆర్థిక లాభాలు సాధించాలి

సంగెం, మార్చి 14 : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులతోపాటు వ్యవసాయ అనుబంధ రంగమైన కోళ్ల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రదాన శాస్త్ర వేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో గురువారం రైతులకు కోళ్ల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శశాంక్, సాయికిరణ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

సంగెం, మార్చి 14: మండల కేంద్రంలో ప్రజాపరిషత్ రూ.4లక్షల నిధులతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు గురువారం సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పులి వీరస్వామి, మండల రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నరహరి, బాబు, రమేష్, రాజు, సదయ్య, శరత్, సత్యానారాయణ, సాంబయ్య, మోహన్, చంద్రశేఖర్, భాస్కర్, రాజేష్, మనోహర్, గంగాదర్, సంపత్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

సంగెం, మార్చి 14 : మండలం కేంద్రంలో 15 నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని సంగెం మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులు, ఆవులు, గేదెలు, ఎద్దులకు గాలి కుంట వ్యాది టీకాలు వేయించుకొనుటకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 14: ఈనెల 17 నుంచి నిర్వహించే కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే రూ.60 లక్షలతో 3సామూహిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సరాఫరా, విద్యుత్, వైద్యం, పారిశుధ్యం వంటివి ఏర్పాట్లు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. జాతరకు రాజకీయ ప్రభలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు కొమ్మాల నుంచి అనంతారం వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఈవో శేషగిరిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ పటిష్టతకు కృషి: రేవూరి

రాష్ట్రంలో రైతు సహకార సంస్థల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని ఎమ్మెల్యే రేవూరి అన్నారు. మొగిలిచర్ల పీఏసీఎస్ పరిధిలోని రెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన డీసీసీబీ బ్యాంకు శాఖను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. పీఏసీఎస్ అభివృద్ధి కోసం ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించాలని చైర్మన్ రమేష్ కోరగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు, వైస్ చైర్మన్ కుందూరి వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీవో సంజీవరెడ్డి, సీఈఓ వజీర్‌సుల్తానా, డైరెక్టర్‌లు దొంగల రమేష్, చెట్టుపెల్లి మురళి, ఎర్రబెల్లి గోపాల్‌రావు, పోలెపాక శ్రీనివాస్, మాడుగుల రమేష్, కొండా నరేందర్, ఎలగం రవిరాజు, కార్పొరేటర్ మనోహర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

ప్రభుత్వ భూమిలో గుడిసెల తొలగింపు

పోచమ్మమైదాన్, మార్చి 14: వరంగల్ మండలం పైడిపెల్లి రెవెన్యూ గ్రామపరిధిలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ ప్రభుత్వ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను గురువారం అధికారులు తొలగించారు. తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్ నేతృత్వంలో పోలీసులు గుడిసెలను తొలగించేందుకు యత్నించగా గుడిసెవాసులు, సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కొన్ని గుడిసెల్ని తొలగించారు. కొంత సమయం ఇస్తే గుడిసెలను తొలగిస్తామని గుడిసెవాసులు హామీ ఇవ్వడంతో అధికారులు అనుమతించారు. తహసీల్దార్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడంతో చుట్టు పక్కల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రంజిత్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గుడిసెలు తొలగించామని, మిగిలిన గుడిసెలు తొలగించేందుకు వారికి కొంత సమయం ఇచ్చినట్లు వెల్లడించారు.



ప్రభుత్వ భూమిలోని గుడిసెలు తొలగిస్తున్న దృశ్యం

గంగదేవిపల్లిని సందర్శించిన కర్నూలు వాసులు

గీసుగొండ, మార్చి 14: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని పలు గ్రామాల నుంచి 48 కమ్యూనిటి డెవలప్‌మెంట్ లీడర్‌లు రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బృందానికి గ్రామాభివృద్ధి, అభివృద్ధి కమిటీల పనితీరు, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంపై జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామేశ్వరీ, రెహనా, ట్రైనర్‌లు నరసింహులు, శ్రీనివాసులు, కమ్యూనిటి ఆర్గనైజర్‌లు నాగలక్ష్మి, ఓబులేసు, రామాంజనేయులు, రమ పాల్గొన్నారు.

సందర్శించిన అంబుడ్స్‌మెన్

జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని 30 మంది అంబుడ్స్‌మెన్‌లు గురువారం సందర్శించారు. హైదరాబాద్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(నిర్డ్) ఆధ్వర్యంలో నిర్వహించే ట్రేయినింగ్‌లో భాగంగా గ్రామాన్ని సందర్శించినట్లు బృందం ప్రతినిధి, సామాజిక తనిఖీ ఎస్‌పీఎం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పల్లెప్రకృతి వనం, నర్సరీ, ప్లాంటేషన్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సురేష్, ఏపీఎంలు మోహన్, చంద్రకాంత్, ఈసీ శ్రీలత, గోపి, అనిల్ పాల్గొన్నారు.



గంగదేవిపల్లిని సందర్శించిన డెవలప్‌మెంట్ లీడర్లు

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

సంగెం, మార్చి 14: పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషాదయాల్ సూచించారు. బొల్లికుంట రైతువేదికలో గురువారం పంటలపై పురుగులు, తెగుళ్ల నివారణపై అభ్యుదయ రైతులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఉషాదయాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జాతీయ పురుగు, తెగులు నిఘా సంస్థ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం)మొబైల్ ఆప్‌పై హైదరాబాద్ కేంద్ర సమగ్ర సస్య రక్షణ కేంద్రం ఆధ్వర్యంలో అభ్యుదయ రైతులకు శిక్షణనిచ్చారు. వ్యవసాయంలో అధిక ఉత్పత్తికి ఆటంకం కల్పించే చీడపీడలను నివారించడంపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, హనుమకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, హైదరాబాద్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు లీలావతి, శ్వేత, జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి జిల్లా కన్సల్‌టెంట్ సారంగం, జిల్లా వ్యవసాయ కార్యాలయం అధికారి శ్రీధర్, ఖిలా వరంగల్ మండల వ్యవసాయ శాఖ అధికారి విజ్ఞాన్, వ్యవసాయ విస్తరణ అధికారి సత్య ప్రకాశ్ పాల్గొన్నారు.

అలాగే.. గవిచర్ల, తీగరాజుపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాల్ రైతులతో సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్‌టెంట్ సారంగం, మండల వ్యవసాయ అధికారి యాకయ్య, జిల్లా వ్యవసాయ (టెక్నికల్)అధికారి శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.



బొల్లికుంటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

సీఐని సన్మానించిన చిరువ్యాపారులు

వరంగల్ చౌరస్తా, మార్చి 14: ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎం.శివకుమార్‌ను నగరంలోని చిరువ్యాపారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిరువ్యాపారుల సంఘం నాయకులు గజ్జెల లింగమూర్తి, సంగరబోయిన చందర్ యాదవ్,సంఘం నాయకులు ఎండి షఫీ, ఉపేందర్, సందాని, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గీసుగొండ, మార్చి 14: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ పాఠశాల టెన్త్ విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని గురువారం అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్, ఉపాధ్యాయులు రఘువీర్, షాహీనాసుల్తానా, చంద్రశేఖర్, అనిత, ప్రణతికుమారి, ప్రభాకర్, దమరి, సీఆర్పీ రవి, శివ, పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మట్టెవాడ, మార్చి 14: సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని వరంగల్ ఏసీపీ నందిరాం కోరారు. గురువారం వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని మట్టెవాడ, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసుల కవాతు నిర్వహించారు. పోచమ్మమైదాన్, మండిబజార్, జేపీఎన్‌రోడ్డు, ఆర్ఎన్‌టీ రోడ్డు, బట్టల బజార్, ఎస్వీఎన్ రోడ్డు మట్టెవాడ పోలీసు స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. సాయంత్రం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని శంభునిపేట, రంగశాయిపేట, గవిచర్ల క్రాస్‌రోడ్డు, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్‌తోట, పెరుకవాడ తదితర ప్రాంతాల్లో సాయుధ పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో సీఆర్‌పీఎఫ్ కమాండర్ శరణాథ్, మట్టెవాడ, మిల్స్‌కాలనీ సీఐలు టి.గోపి, మల్లయ్య, ఎస్సైలు నవీన్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 14: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో నిత్యం బిజీ బిజీగా ఉండే మహిళా సిబ్బంది క్రీడల్లో పాల్గొని కాసేపు రిలాక్స్ అయ్యారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం బల్దియా ఇండోర్ స్టేడియంలో పలు క్రీడల్లో మహిళా ఉద్యోగులకు ఆటవిడుపుగా ఆటలు నిర్వహించారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు మహిళా సిబ్బందికి వివిధ క్రీడాంశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. బ్యాడ్మింటన్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ చెస్, తగ్‌ఆఫ్‌వార్, రంగోళి విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పర్యవేక్షకులుగా డీఎఫ్‌వో శంకర్ లింగం, బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్‌రావు, సూపర్‌వైజర్ రాజులు ఉన్నారు.



ఇండోర్ స్టేడియంలో క్యారమ్స్ ఆడుతున్న మహిళా సిబ్బంది

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

గీసుగొండ, మార్చి 14: గీసుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. రోజువారి ఔట్ పేషంట్, రోగులను వైద్యసేవల అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సుధీర్‌సింగ్, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా టీబీ రహిత గ్రామాలుగా రాంపురం, కొనాయిమాకులను వారు ప్రకటించారు.



వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న వెంకటరమణ

సంతాప సభ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా, మార్చి 14: కార్మిక ఉద్యమ నేత, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు కూరపాటి లింగమూర్తి సంతాప సభను 17న ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల ద యాకర్ తెలిపారు. సంతాప సభ వాల్‌పోస్టర్‌ను వరంగల్ చౌరస్తాలో గురువారం ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆజంజాహి మిల్లు కార్మికుల కోసం ప్రింటింగ్, బైండింగ్ కార్మికుల వేతనాల కొరకు యూనియన్ స్థాపించి అనేక విజయాలు సాధించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచర్ల బాలరాజు, బన్న నర్సింగం, గంద్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, వనం కిరణ్, కె.రాజేందర్, పాపయ్య పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తాలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంయుక్త కిసాన్ మోర్చా నిరసన ప్రదర్శన

గిర్మాజిపేట, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ స్థాయి పిలుపులో భాగంగా గురువారం నగరంలో రైతు, కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. జిల్లా కన్వీనర్ కె.బాబురావు ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హెడ్‌పోస్టాఫీసు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, శంకరయ్య, చంద్రన్న, ఓదెల రాజన్న తదితరులు పాల్గొన్నారు.



సంయుక్త కిసాన్ మోర్చా నిరసన దృశ్యం



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 15 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి



నీటి ఎద్దడి సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ కోమలభద్రయ్య

దుగ్గొండి, మార్చి14: వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తాగునీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా నిధులను వినియోగించాలని అందుకు తీర్మాణం చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామాలకు సరిగా రావడం లేదని ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకపోయారు. ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏఈ మౌనిక, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పిల్లలు జాగ్రత్త..



• నేటి నుంచి ఒక్కపూట బడులు • పిల్లలపై నజర్ తప్పనిసరి • సరదా మాటున ప్రమాదాలు

ఖానాపురం, మార్చి 14: ఒంటి పూట బడులతో అర్ధ రోజు సెలవు.. చిన్నారులకు చెప్పలేని ఆనందం.. ఎక్కువ సమయం ఆడుకోవచ్చు.. సరదాగా స్నేహితులతో గడపొచ్చు. ఇదీ పిల్లల ఆలోచన. అయితే సరదాల మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెడుతూనే ఉండాలి. వేసవిలో ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యరీత్యా విద్యాశాఖ పాఠశాలలకు నేటి నుంచి ఒంటి పూట బడులు నిర్వహిస్తోంది. దీంతో పిల్లలు ఎక్కువ సమయం ఆడుకోవడానికి యత్నిస్తుంటారు. బడి నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఆటల బాట పడుతుంటారు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా స్నేహితులతో బయటకు వెళ్లి హాయిగా గడపాలనుకుంటారు. ఈ ఆనంద సమయాల్లో ఎన్నో అనార్థాలు పొంచి ఉన్నాయనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడే అవకాశముంది.

వాహనాలతో జాగ్రత్త..

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై పిల్లలకు మోజు ఎక్కువ. ఇంట్లో చెప్పినా వినకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కి ప్రమాదాల బారీన పడే అవకాశముంది. ఈ నేపద్యంలో చిన్నారులను మోటారు సైకిళ్లు, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. బైక్‌ల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు. అలా గే పిల్లలను ఎక్కువ సమయం తిరగనిస్తే పరీక్షల సమయంలో అనారోగ్యా నికి గురవుతారు. ఎక్కువ సేపు ఆడుకోనివ్వకూడదు. ఇంట్లో



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

తరుచూ కంప్యూటర్, వీడియో గేమ్స్‌లు, మొబైల్ గేమ్స్‌లు, టీవీలకు అతుక్కుపోతే దృష్టి లోపం తలెత్తే అవకాశముందని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంతవరకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

ఇంటి పట్టునే ఉంచాలి

ఒంటి పూట బడి సమయంలో పాఠశాల అయిపోయాక చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా తోటి పిల్లలు, స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి ఎక్కువ ఇష్టపడుతుంటారు. అయితే వేసవిలో ఎండకు తిరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు ఇంటి ఆవరణలో, పరిసరా ప్రాంతాల్లో ఆడుకునేలా, చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలి. పాఠశాల అనంతరం వారు ఇంటి పట్టునే ఉండేలా చూడాలి.

కాలువలు, బావులు, చెరువులతో ప్రమాదం..

ఒంటిపూట బడులు, వేసివి సెలవుల్లో పిల్లలు ఎండవేడికి తాళక ఈతపై సరదా చూపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీలైనంత వరకు పిల్లల్ని చెరువులు, బావుల వద్దకు ఒంటరిగా పంపకూడదు. ఈత నేర్పాలనుకుంటే తల్లిదండ్రులే తీసుకెళ్లి కొంత సమయంవరకు ఈత నేర్పడం ఉత్తమం. ఈ ఏడాది కొన్ని చెరువులు బావులు నిండుగా ఉన్నా యి. దీంతో వాటి లోతు తెలియక పిల్లలు చెరువులు, కాలువల్లో దిగి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

పెద్దల సమక్షంలో శిక్షణ..

సైకిల్ తొక్కడం, ద్విచక్రవాహనాలు నడపడం నేర్చుకోవాలన్న కోరిక పిల్లలో సహజంగానే ఉంటుంది. వారి వయస్సు ఆధారంగా సైకిల్‌గాని, ద్విచక్రవాహనం పడిపేందుకు శిక్షణ తోటి మిత్రుల ఆధ్వర్యంలో కాకుండా పెద్దల సమక్షంలో, శిక్షకుల పర్యవేక్షణలో జనసంచారం లేని చోట జరిగేలా చిన్నారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- చిన్న పిల్లలను పాఠశాల నుంచి ఇంటికి తీసుకువచ్చే సమయంలో గొడుగుపట్టాలి. పిల్లలు తప్పని సరిపరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ పెట్టుకునేలా ప్రోత్సహించాలి.
- బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపించడం మంచిది కాదు.
- తల్లిదండ్రులు పిల్లల కోసం అధిక సమయం కేటాయించి, వారితో సరదాగా గడపాలి. విజ్ఞాన, వినోద పుస్తకాలు చదివించాలి.
- పిల్లలు ఇంటి నుంచి బయటకు ఎటువైపు వెళ్లినా తప్పకుండా సమాచారం ఇచ్చి వెళ్లెలా పిల్లలకు అవగాహన కల్పించాలి.
- పిల్లలు ఇంట్లో మారం చేస్తే వారికి సర్దిచెప్పాలే తప్ప కోపతాపాలకు పోయి, కొట్టడం, కోపంతో బెదిరించడం చేయకూడదు.

పిల్లలపై ఉష్ణోగ్రతల ప్రభావం : డాక్టర్ జ్యోతి, వైద్యాధికారి,

వేసవిలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండటం మూలంగా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. పిల్లలు వేసవిలో సాధ్యమైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. వడదెబ్బ తగలకుండా బయటకు వెళ్లే సమయంలో ఎక్కువ నీరు తాగాలి. శీతల పానియాలకు బదులు కొబ్బరి బొండాం, పండ్ల రసాలు ఎక్కువ తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించాలి.

సిద్ధేశ్వరాలయంలో హుండీ లెక్కింపు

చెన్నారావుపేట. మార్చి 14: మండల కేంద్రంలోని సిద్ధేశ్వరాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమంను గురువారం మహాశివరాత్రి వేడుకల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. మహాశివ రాత్రి ఉత్సవాలల్లో భాగంగా భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల్లో రూ 13 వేల 60 హుండీ ద్వారా వచ్చిందని ఆలయ అర్చకులు భిక్షమయ్యశాస్త్రీ, సాయిశాస్త్రీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గాలికుంటు నివారణ టీకాలు

నెక్కొండ, మార్చి 14 : ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 15 వరకు నెక్కొండ మండలంలోని గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తామని నెక్కొండ పశువైద్యాధికారి డాక్టర్ మమత గురువారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15న ముదిగొండ, 16 హరిచంద్‌తండా, 18 దీక్షకుంట, 19 సీతారాపురం, 20 దేవుని తండా, 21 పనికర, 22 రామన్నకుంట, 23 సూరుపల్లి, 25 అమీన్‌పేట, 26 టేకులకుంట, 27 గుండ్రపల్లి, 28 అప్పల్‌రావుపేట, 29 మడిపల్లి, 30 కస్నతండా, ఏప్రిల్ 1న నెక్కొండ, 2 నెక్కొండ తండ, 3 పత్తిపాక, 4 సాయిరెడ్డిపల్లి, 5 రెడ్లవాడ, 6 పిట్టకాలుబోడు, 8 మహబూబ్‌నాయక్, 9 గొల్లపల్లి, 10 చంద్రుగొండ, 11 బంజరుపల్లి, 12 లావుడ్యావాగ్యానాయక్, 13 మూడుతండ, 14 గొట్లకొండ, 15 అజ్మీరమంగ్య గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తారని వివరించారు.

మహిళా భవనానికి భూమి పూజ



మహిళా భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లబెల్లి, మార్చి 14: మండలంలోని నారక్కపేట గ్రామంలో గురువారం మహిళా సంఘం భవనానికి భూమి పూజను కాంగ్రెస్ నాయకులు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పైనాల అశోక్ మాట్లాడుతూ.. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నారక్కపేట గ్రామంలో మహిళా సంఘం భవనం కోసం భూమి పూజను చేశామని తెలిపారు. నాయకులు కొలిపాక పైడి, అత్తె నవీన్, సూరబోయిన రాంబాబు, చిందం కుమారస్వామి, వడ్లూరి రమేష్, గుండాల రాజకొమురయ్య, కోడూరి రాయసాబ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, పరికరాల పంపిణీ

దుగ్గొండి, మార్చి14: మండలంలోని లక్ష్మీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం కంప్యూటర్, ప్రింటర్, సౌండ్స్‌లు పంపిణీ చేశారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల చదువులకు ఉపయోగపడే విధంగా సంస్థ ద్వారా పాఠశాలలకు అందించడం జరుగుతుందన్నారు. హెచ్ఎంలు కృష్ణమూర్తి, స్వప్న, ఉపాధ్యాయులు ఆనందకుమార్, మధుమోహన్, సీతారాంరెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడాలి

దుగ్గొండి, మార్చి14: మహిళల హక్కులు కాలరాస్తున్న దాడులను హింసలను ప్రేరేపిస్తున్న మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలని స్త్రీ సంఘటన ఎడిటర్ ఎం.లక్ష్మీ పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మంపేటలో గురువారం పీవోడబ్ల్యూ స్త్రీ సంఘటన జిల్లా కమిటీ సమావేశం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించగా లక్ష్మీ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కాష్త్ర కార్యదర్శి మోడెం శ్రీలత, డాక్టర్ సింధూజారెడ్డిఈరెల్లి శారద, మేక దేవేంద్ర, కళ్లెపు శ్రీజ, కునూరు శోభ, భాషబోయిన అనిత తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

పర్వతగిరి, మార్చి 14: ఎంపీడీవోగా ఆరేళ్లపాటు విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో చక్రాల సంతోష్‌కుమార్‌కు గురువారం మండలపరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కమల, మాజీ జడ్పీటీసీలు మేడిశెట్టి రాములు, లూనావత్ పంతులు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ సర్వర్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, భాస్కర్, మోహన్‌రావు, మల్లయ్య ప్రస్తుత ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో పాల్గొన్నారు.

డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

వర్ధన్నపేట, మార్చి 14: పురుగు మందుల డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాంనర్సయ్య సూచించారు. షాపుపేరు మార్చుకునేందుకు రూ. 100 బాండ్ పేపరు మీద ఎందుకు మార్చుకుంటున్నారనే విషయాన్ని తెలియజేస్తూ నోటరీతో ధృవీకరించాలన్నారు. లెటర్ ప్యాడ్ నందు సంబంధిత డీలరు కనీసం ఒక సంవత్సర లావాదేవీలను నమోదు చేయడంతోపాటు మిగిలిన స్టాక్‌ను ధృవీకరించాలని సూచించారు. లైసెన్సింగ్ అధికారి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో గోదాము నమోదుకు తగిన డాక్యుమెంట్స్ సమర్పించిన సందర్భంలో సంబంధిత పురుగుల మందుల అధికారి, వ్యవసాయ సహాయ సంచాలకులు ధృవీకరించి అభ్యర్థించిన మేరకు లైసెన్సింగ్ అధికారికి ఇవ్వాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట, మార్చి 14 : పట్టణంలోని పలు చోట్ల నేటి (శుక్రవారం) ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీదర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ పట్టణంలోని సర్వాపురం, వడ్డెరకాలనీ, మహబూ బాబాద్‌రోడ్, ప్రాంతాలలో విద్యుత్ వైర్ల మరమ్మతులు, చెట్లకొమ్మలు కొట్టించే పనులు నిర్వ హిస్తుండడం వల్ల ఈ ప్రాంతాల్లో నేటి ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, మార్చి 14: మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.1.80 కోట్లతో పర్వతగిరి నుంచి సోమారం రోడ్డునిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చింతనెక్కొండలో రూ.3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, రూ.25 లక్షలతో సోమారం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, దౌలత్‌నగర్ గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభం, కల్లెడలో రూ.5 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌళిక వసతులు కల్పించడానికి గాను ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా చింతనె క్కొండ, ఏబీ తండా, సోమారం, జమాల్‌పురం గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బానోత్ సింగులాల్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



కారల్‌మార్క్స్ చి త్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట, మార్చి 14 : కార్మికుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడిన కారల్ మార్క్స్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కొరబోయిన కుమారస్వామి పార్టీనాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం కారల్‌మార్క్స్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చి త్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారల్‌మార్క్స్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని కార్మికుల, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నమీండ్లస్వామి, హన్మకొండ శ్రీధర్, గడ్డమీది బాలకృష్ణ, కందికొండరాజు, కలకోటి అనిల్, పస్తం ఎల్లయ్య, కోట నరేశ్, రామగిరిరాహుల్. నరసింహారావు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్, మురళీధర్

నర్సంపేట టౌన్, మార్చి 14 : నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నర్సంపేట పట్టణానికి చెందిన లీడ్ చిల్డ్రన్స్ లైబ్రరీ, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన పూలే గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి వారోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గ్రంథాలయ ప్రారంభోత్సవానికి లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్, హైస్కూల్ ఎస్సెస్సీ మొదటి బ్యాచ్ టాపర్ నాంపల్లి మురళీధర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. దాతల సహకారంతో పాఠశాల ఆవరణలో నిర్మించిన గదులలో లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సుధాకర్, ఫాతిమ, ప్రభాకర్, కుమారస్వామి, రవీందర్, రఘుపతి, రాములు, మహేందర్, శ్రీనివాస్, రత్నమాల, తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ కమిటీ నియామకం

వర్ధన్నపేట, మార్చి 14: ఎంహెచ్‌డీ వర్ధన్నపేట మండల కమిటీని గురువారం నియామకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఆధ్వర్యంలో మండల కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా తుమ్మల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా తూళ్ల సంపత్, తుమ్మల రాజు, కొండేటి బాల కృష్ణ, తుమ్మల శోభన్ బాబు, జలగం ప్రసాద్, కొండేటి రాంబాబు, చల్లా కనకయ్య, కందిక సారయ్య, అయితే ఎల్లయ్య, బిర్రు వెంకన్న, దాసరి వీరన్న, కొమురయ్య ఎన్నికయ్యారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, మార్చి 14: వెనుకబడిన సామాజిక వర్గాలకు సంబంధించి 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య మాట్లాడారు. ఎస్సీసెల్ జిల్లా నాయకులు కొండేటి బాలకృష్ణ, ఐత యాకాంతం, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, వర్ధన్నపేట ఎస్సీసెల్ టౌన్ ప్రెసిడెంట్ చెరుపల్లి బాబు, ఎస్సీసెల్ నాయకులు జనగామ చంద్రమౌళి, కొండేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం



పద్మావతి రైలు లోకోపైలట్లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నెక్కొండ, మార్చి 14 : నెక్కొండ రైల్వే స్టేషన్‌లో నూతనంగా హాల్టింగ్ (ఈ నెల 14 నుంచి) అయిన తిరుపతి-సికింద్రాబాద్ పద్మవతిసూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు గురువారం తెల్లవారుజామును నెక్కొండ మండల రైల్వే టికెట్ల ఫోరం సభ్యులు, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఉదయం రెండు గంటల ఇరవై నిమిషాలకు నెక్కొండ స్టేషన్‌కు పద్మవతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగిన వెంటనే రైలు ఇంజన్‌ను పూలతో అలంకరించారు. అలాగే రైలు లోకోపైలెట్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రైల్వే టికేట్ల ఫోరం చైర్మన్ గొరంటల వెంకటనారాయణ, సభ్యులు అంబాల రాంగోపాల్, భూపతి వీరన్న , రాపాక సందీప్, పులి ప్రసాద్, అశోక్, గిరినాథ్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

● నర్సంపేట నియోజకవర్గంలోని ఏకైక రైల్వే స్టేషన్ అయిన నెక్కొండలో పలు ఎక్స్‌ప్రెస్ రైలకు హాల్టింగ్ ఇప్పించాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హైదరాబాద్‌లో గురువారం వ్యాపారులు, బీజేపీ నాయకులు, రైల్వే టికెట్ల ఫోరం సభ్యులు వినతి పత్రం అందించారు . శాతవాహన, నవజీవన్, గౌతమి, చార్మినార్, నాగర్‌సోల్ సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇప్పించాలని విజ్ఞాపన పత్రంలో పెర్కొన్నారు. మండల్ బీజేపీ అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి , రైల్వే టికెట్ల ఫోరం చైర్మన్ గొరంట్ల వెంకటనారాయణ, వ్యాపారులు, విజయ్‌కుమార్, అనంతుల మురళీధర్, నర్సింహాస్వామి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడి మృతి

పది రోజుల క్రితం మోత్యాతండా ఘటనలో గాయాలు..



జశ్వంత్(ఫైల్)

పర్వతగిరి, మార్చి 14: మండలంలోని మోత్యాతండాలో విద్యుత్ ప్రమాదానికి గురై ముగ్గురు మృతిచెందిన సంఘటనలో గాయాలతో చికిత్స పొందుతున్న భూక్యా జశ్వంత్(5) గురువారం మృతిచెందాడు. మోత్యాతండాలో ఈనెల 4న దుర్గమ్మ పండుగ కోసం ఏర్పాట్లు చేస్తుండగా అధికలోడ్‌తో విద్యుత్‌తీగలు తెగిపడి ముగ్గురు మృతిచెందారు. ఘటనలో అదే తండాకు చెందిన బాలుడు జశ్వంత్ గాయాలపాలై ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. సుమారు పదిరోజుల చికిత్స అనంతరం గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎంజీఎంకు చేరుకుని బాలుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జడ్పీటీసీ బానోత్ సింగులాల్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావ పాల్గొన్నారు.

డ్రెయినేజీని శుభ్రం చేసిన మునిసిపల్ కార్మికులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

నర్సంపేట, మార్చి 14 : పట్టణంలోని నెహ్రూపార్కు సమీపంలో రోడ్డుపై పారుతున్న మురికినీరు ఇబ్బందులు పడుతున్న వాహన దారులు, పాదాచారులు పట్టించుకోని మునిసిపల్ అధికారులు అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం ఇద్దరు మునిసిపల్ కార్మికులు నెహ్రూపార్కు సమీపంలోని డ్రైనేజీ వద్దకు చేరుకొని పుట్‌పాత్ కోసం డ్రైనేజీపై వేసిన షాబాదిరాళ్లను తొలగించి రెండుగంటల పాటు శ్రమించి డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి దుర్గంధాన్ని తొలిగించి డ్రైనేజీని శుభ్రం చేశారు. డ్రైనేజీని శుభ్రం చేయడంపై చిరు వ్యాపారులు, వాహనదారులు, పాదాచారులు, కాంగ్రెస్ నాయకుడు కొంకీస మదన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. అన్ని వార్డుల్లో అధ్వాన్నంగా మారిన డ్రైనేజీలను శుభ్రం చేసే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రాములు చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సంపేట టౌన్, మార్చి 14 : యాదవ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేషన్ కోసం కృషి చేసిన జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు చిత్రపటానికి యాదవ సంఘం నాయకులు గురువారం నర్సంపేట పట్టణంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గడ్డం కుమార్, కోడి అశోక్, శ్రీధర్, శ్రీకాంత్, యాదగిరి, అనిల్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు బాగుంటేనే గ్రామాల అభివృద్ధి

నెక్కొండ, మార్చి 14 : పక్కా రవాణా సౌకర్యం ఉన్న గ్రామాలు అన్ని రకాల అభివృద్ధి చెందుతాయని నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లి, బొల్లికొండ, చంద్రుగొండ ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతను పాటించాలని, పనులను ప్రజలు పర్యవేక్షించాలని ఆయన కోరారు. అలాగే మండలంలోని సూరుపల్లి గ్రామ శివారు రాంపూర్ తండాలో కనకదుర్గమ్మ దేవాలయం అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. గుడి ఆవరణలో సొంత ఖర్చులతో టైయిల్స్ వేయిస్తామని రంజిత్‌రెడ్డి తెలిపారు. నెక్కొండ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివ, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, బక్కి నరేష్, మాజీ సర్పంచ్ బానోతు శ్రీధర్, ఎంపీటీసీ శారద, శ్రీనివాస్, నగేష్, కవిరాజ్ పాల్గొన్నారు.